క్లుప్తంగా

రేపు విద్యా సంస్థల బంద్

ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్

మొయినాబాద్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ నెల 23న చేపడుతున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్ అన్నారు. సోమవారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేస్తోందన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయలేదని మండిపడ్డారు. ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని.. ఫీజుల నియంత్రణకోసం సమగ్ర చట్టం చేయాలనే డిమాండ్‌లతో చేపడుతున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

బాలయ్య మృతి పార్టీకి తీరని లోటు

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ నాయకుడు ర్యాకల చిన్నబాలయ్య మృతి పార్టీకి తీరని లోటు అని కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన చిన్నబాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం విషయం తెలుసుకున్న రవీందర్ యాదవ్ గ్రామానికి చేరుకొని చిన్నబాలయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాలయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడి కుటుంబీకుల పరామర్శించిన వారిలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు వీరేశంగుప్తా తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు సదస్సుకు తరలిన దివ్యాంగులు



కేశంపేట: సభకు తరలివెళ్తున్న పింఛన్‌దారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచి ఇవ్వాలనే డిమాండ్‌తో సోమవారం ఆమనగల్లు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల చేయూత పింఛన్‌దారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండలం నుంచి పింఛన్ లబ్ధిదారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు మైసయ్య, యాదమ్మ, యాదయ్య, రమేశ్, మల్లేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణ స్థలాన్ని మార్చాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆగిర్యాల గ్రామస్తులు

కొందుర్గు: మండల పరిధిలోని ఆగిర్యాలలో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ భవనాన్ని నిర్మాణ స్థలాన్ని మార్చాలని గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ స్థలంలో ఇదివరకే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జ్యోతిరావు పూలే, భగత్‌సింగ్, చాకలి ఐలమ్మ తదితర మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించామని.. గ్రామంలో ఏ కార్యక్రమమైన ఇక్కడే నిర్వహించడం జరుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇక్కడ గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించినట్లయితే మహనీయుల విగ్రహాలకు అడ్డుగోడ పెట్టినట్లు అవుతుందని వివరించారు.

మైసమ్మ సన్నిధిలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సోమవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చక సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలకగా.. అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు అమ్మవారి తీర్థ ప్రసాదం అందజేశారు. సంప్రదాయం ప్రకారం శాలువాతో ఘనంగా సన్మానించారు.

పక్షం రోజులన్నారు..



బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

ఐదు నెలలైంది!

- రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు తవ్వడంతో ఇబ్బందులు
- చిన్నపాటి వర్షానికే చెరువును తలిపించేలా నిలుస్తున్న నీరు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు, ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు చెరువులు లేవు. ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం కృత్రిమంగా ఓ తటాకమే నిర్మించారు. ఎవరి మేలు కోసమే బ్రిడ్జి కింద భారీ ఎత్తున తవ్వి సీసీ రోడ్డు వేయడంతో మున్సిపల్ వాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఐదు నెలల క్రితమే అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు. తాత్కాలికంగా నీటి మళ్లింపునకు కాల్వ తీసినప్పటికీ పూర్తి స్థాయిలో నీరు వెళ్లడం లేదు.

భారీ వాహనాలు వెళ్లేందుకు ..

ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి కింద గతేడాది ఆర్‌అండ్‌బీ అధికారులు పాత రోడ్డును పెద్ద ఎత్తున తవ్వి, భారీ వాహనాలు సులువుగా వెళ్లేందుకు గాను సీసీ రోడ్డును వేశారు. వర్షాల కారణంగా నీరు నిలుస్తోందని తెలిసినప్పటికీ ఎలాంటి పరిష్కారం చూపకుండా గాలికి వదిలేశారు. రోడ్డు నిర్మాణ సమయంలోనే ఫత్తేపూర్ వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. అధికారులు సర్ది చెప్పి చేతులు దులుపుకొన్నారు.

పరిశీలనకే పరిమితం

ఈ ఏడాది మార్చిలో కురిసిన అకాల వర్షానికి బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున నీరు నిలిచింది. విషయం గమనించిన మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అప్పటికప్పుడే పరిశీలించి వర్షపు నీటి తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఫిబ్రవరిలో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, సీఐ శ్రీనివాస్ గౌడ్, ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశంలు అందరూ కలిసి ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద సంయుక్త పరిశీలన చేశారు. వర్షపు నీరు నిలిచే అవకాశం ఉందని, వెంటనే నీరు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించి, మున్సిపాలిటీ నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని కమిషనర్ భరోసా ఇచ్చారు. సమీపంలోని తీగలవాగులోకి అంతర్గత కాల్వ తీసి, కలిపేందుకు సమాలోచనలు చేశారు. పక్షం రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్న ఆర్‌అండ్‌బీ అధికారులు ఐదు నెలలు రోజులు కావొస్తున్న బోద్యం చూస్తున్నారు. వర్షకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా అధికారులు ఇటుగా వచ్చిన దాఖలాలే లేవు. వాహనదారులు మాత్రం వర్షం కురిసిన ప్రతీసారి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

కేంద్ర రైల్వే మంత్రికి విన్నవించాం



ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు వేసి, మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం అనాలోచిత చర్య. ఇదే అంశంపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక పనులు కాకుండా, శాశ్వత పనులపై అధికారులు దృష్టి సారించాలి. మూడు రోజుల క్రితం శంకర్‌పల్లికి వచ్చిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కి సైతం లిఖితపూర్వకంగా విన్నవించాం.

– డి.గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, శంకర్‌పల్లి

చర్యలు తీసుకోవాలని చెప్పాం



ఆర్‌అండ్‌బీ అధికారులు ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి నుంచి తీగల వాగు వరకు మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికే అధికారుల బృందం పరిశీలన చేసింది. పట్టణవాసులు, ఇతర ప్రాంతాల వారి ఫిర్యాదుల మేరకు ఆర్‌అండ్‌బీ ఏఈకి లిఖిత పూర్వకంగా రాసి, ఎలాంటి ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని సూచించాం.

– యోగేశ్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి

సేవలను విస్తృతం చేయాలి

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ



రవికుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ

షాద్‌నగర్‌రూరల్: సమాజాభివృద్ధిలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా సంకల్ప్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని కేకేఆర్ కన్వెన్షన్ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ 14వ వార్షికోత్సవ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా సంకల్ప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన క్లబ్ అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా లింగారెడ్డి, సెక్రటరీగా విజేందర్‌రెడ్డి, ట్రెజరర్‌గా శ్రీరామ్‌గౌడ్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన క్లబ్ సభ్యులతో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శశికాంత్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవాదృక్పథాన్ని అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. పేదలకు చేయూతనిస్తూ వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కేబినెట్ సభ్యులు శరత్‌చంద్ర బాబు, ఎంవీఎస్.రంగయ్య, రీజియన్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ అమరేందర్‌రెడ్డి, కో చైర్మన్ డాక్టర్ శివానంద్, మదన్‌మోహన్‌రెడ్డి, శివనాగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

చేరదీసి.. సపర్యలు చేసి

ఆశ్రమంలో చేర్పించిన కానిస్టేబుళ్లు



మతిస్థిమితం లేని వ్యక్తితో కానిస్టేబుళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన కానిస్టేబుళ్లు.. సపర్యలు చేశారు. భోజనం తినిపించి అనాథశ్రమంలో చేర్పించి, మానవత్వం చాటుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వండర్‌లా పరిసరాల్లో చిరిగిన బట్టలు, మాసిన జుట్టు, చేతిలో గొడ్డలితో ఓ వ్యక్తి వింతగా ప్రవర్తిస్తూ తిరుగుతున్నాడు. ఇది గమనించిన హెడ్ కానిస్టేబుల్ బురుగు బాల్‌రాజ్, కానిస్టేబుల్ శివాజీలు ఆ యువకున్ని చేరదీశారు. గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు రాబట్టే యత్నం చేసి విఫలం అయ్యారు. అనంతరం స్నానం చేయించి, కొత్తగా దుస్తులు వేయించారు. భోజనం తినిపించి మాతృదేవోభవ ఆశ్రమానికి తరలించారు. అనాథను చేరదీసి, మానవత్వం చాటుకున్న కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు, ప్రజలు అభినందించారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలకొండ గ్రామానికి చెందిన పలువురు అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు కొండల్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, జగన్ గౌడ్, జైపాల్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, రాంజీ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటా సౌభాగ్యం

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్‌లో రూ.30 లక్షలతో సీసీరోడ్లు, అండర్‌డ్రైనేజీ, పోచారంలో రూ.35 లక్షలతో సీసీరోడ్లు, గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన, ఎల్మినేడులో రూ.40 లక్షతో సీసీరోడ్లు, కుర్మసంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతో పాటు.. ఉచిత విద్యుత్, బస్ ప్రయాణం, రుణమాఫీ ఇలా తదితర సంక్షేమ పథకాలను అందజేశామని పేర్కొన్నారు. రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పట్నం శివశంకర్, బలరాం యాదవ్‌ల, ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వృథాను అరికట్టరేం!



కొత్తూరు సబ్‌స్టేషన్

- అసలే బకాయిలు.. ఆపై దుబారా
- శాఖల సమన్వయ లోపంతో విద్యుత్ వృథా
- ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయక పగటిపూట సైతం వెలుగుతున్న వీధిదీపాలు



వైఎంతండాలో పగటిపూట వెలుగుతున్న వీధి దీపాలు

కొత్తూరు: విద్యుత్ వృథాను అరికట్టి ఆర్థికంగా సంస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ట్రాన్స్‌కో అధికారులు, పాలకులు ఆయా సభలు, సమావేశాల్లో కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. పంచాయతీరాజ్, ఇతర శాఖల సమన్వయ లోపం కారణంగా మండలంలో వీధి దీపాలు, నీటి సరఫరా మోటర్ల వినియోగంలో నిర్వాహణ కరువై విద్యుత్ వరకు వృథా అవుతోంది. ఇప్పటికే వీధి దీపాలు, నీటి సరఫరా మోటర్ల బిల్లులు పెద్ద మొత్తంలో ట్రాన్స్‌కోకు బకాయిలు ఉన్నాయి. అయినప్పటికీ విద్యుత్ వృథాను అరికట్టడానికి అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో ప్రతి ఏడాది బకాయిలు మరింత పెరుగుతున్నాయి.

నిర్వాహణ కరువు

మండల పరిధిలోని చాలా గ్రామాల్లో వీధి దీపాల నిర్వాహణ కరువైంది. ఇన్ముల్‌నర్వ, కొడిచర్లతండా, వైఎం తండా, మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన వీధి దీపాలకు ఏబీ స్విచ్‌లు లేవు. లైట్లు వెలిగేందుకు నేరుగా స్తంభాల వద్దనే స్విచ్‌లు ఏర్పాటు చేశారు. అన్ని వీధి దీపాలకు వేరుగా స్విచ్‌లు ఏర్పాటు చేస్తే ఒక చోట స్విచ్ ఆన్‌చేస్తే అన్ని వెలుగుతాయి. స్విచ్ ఆఫ్ చేస్తే అన్నింటికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కొన్ని గ్రామాల్లో ప్రతీ లైటుకు వేర్వేరుగా స్విచ్‌లు ఏర్పాటు చేయడంతో వాటిని ఉదయం బంద్‌చేసే వారు లేరు. దీంతో రాత్రి పగలు తేడా లేకుండా వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి.

పేరుకుపోతున్న బకాయిలు

మున్సిపాలిటీ, మండలంలో ట్రాన్స్‌కో లెక్కల మేరకు 76 వీధి దీపాలు, 70 నీటి సరఫరా మోటర్లకు కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం వీధి దీపాలకు రూ.49 లక్షలు, నీటి సరఫరా విభాగానికి రూ.1.33 కోట్ల బిల్లులు బకాయిలున్నాయి. విద్యుత్ వృథాను అరికట్టడంలో మాత్రం పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

సహకరించాలి



మున్సిపాలిటీ, పంచాయతీల పరిధిలో వినియోగిస్తున్న వీధి దీపాలు, సింగిల్‌ఫేజ్ తాగునీటి సరఫరా బోర్లకు సరైన నిర్వాహణ, స్విచ్‌లు ఏర్పాటు చేయాలి. వీధి దీపాలను ఉదయాన్నే ఆపివేసేలా చూడాలి. తండాలు, కాలనీల్లో ఉన్న సింగిల్‌ఫేజ్ బోర్ల వద్ద ప్రజలు నీటిని పట్టుకున్న వెంటనే బోరు మోటర్‌ను ఆపివేయాలి. విద్యుత్ వృథాను అరికట్టడంలో ప్రజలు, అధికారులు ట్రాన్స్‌కోకు సహకరించాలి.

– రమేష్‌గౌడ్, ఏఈ ట్రాన్స్‌కో, కొత్తూరు

నర్సింలు కుటుంబాన్ని ఆదుకోవాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడలో ఈ నెల 17న విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, పదుల సంఖ్యలో పశువులు మృతిచెందాయన్నారు. ఇటీవల చిన్న ఎల్కిచర్లలో ఓ రైతు మృతిచెందాడని, ప్రస్తుతం గాలిగూడలో నర్సింలు మృతిచెందడం బాధాకరమన్నారు. ట్రాన్స్‌కో ఏఈ నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కులవృత్తే మా జీవనాధారం

- ఆర్టికల్ 9ను రద్దుచేయాలి
- నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

నందిగామ: నాయీ బ్రాహ్మణేతరులు సెలూన్లు నడుపొద్దని, కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న తమ కడుపులు కొట్టదని నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పుట్టుక నుంచి చావు వరకు అన్నింట్లో తాము ముందుంటామన్నారు. ఇటీవల తమ కులం, మతం కాని వ్యక్తులు తమ వృత్తిలోకి ప్రవేశించి తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి ఆస్తులు లేకుండా కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, ఇతరులు తమ వృత్తిలోకి ప్రవేశించినట్లయితే ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది నాయీ బ్రాహ్మణులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇటీవల న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులు పునః పరిశీలించాలని కోరారు.

బోనం.. ఘనం



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ మాజీ సర్పంచ్ రవళిగోపికృష్ణారెడ్డి



షాబాద్: మద్దూరులో తొట్టెల ఊరేగింపులో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి తదితరులు



మొయినాబాద్: కనకమామిడిలో బోనాల ఊరేగింపు



మొయినాబాద్‌లో తొట్టెల ఊరేగింపు



చేవెళ్ల: మడికట్టు గ్రామంలో ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షిణ

డప్పు చప్పుళ్లు.. పోతురాజుల నృత్యాలు.. శివసత్తుల పూనకాల నడుమ సోమవారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తి ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తొట్టెల ఊరేగింపులో యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– చేవెళ్ల, షాద్‌నగర్ జోన్ బృందం



మొయినాబాద్‌రూరల్: బోనమెత్తిన యువతి



మొయినాబాద్: ముర్తూజగూడలో..



షాబాద్: రుద్రారంలో..



నందిగామ: నర్సప్పగూడలో



కొందుర్గు: ముట్పూర్‌లో..